# టైము లేదు

మా అమ్మాయికి అప్పుడే ఇరవై ఆరేళ్ళు వచ్చాయి. తెలిసిన నలుగురితోనూ చెప్పి ఏదైనా మంచి సంబంధం వుందేమో చూడమంటే చూడడు మా ఆయన' అంది లలిత మా ఆవిడతో.

లలితా వాళ్ళింట్లో భోజనం చేసి తీరిగ్గా కూర్చున్న నేను సూర్యారావ్ వేపు చూశాను, ఏమంటాడా అని.

అతను తల ఎత్తి 'ఈ మధ్య ఆఫీసులో బాగా పని ఎక్కువయింది. వేరే ఏం చేద్దామన్నా టైము దొరకటం లేదు' అన్నాడు.

'ఈ నాలుగు నెలలనించీ ఒక్క పావుగంట టైము దొరకలేదా? అన్నీ బద్ధకపు కబుర్లు. ఎంతమంది బిజీగా పని చేయటంలేదు. అందరూ మీలాగా మిగతా పనులు మానేసి, టైము లేదు అంటున్నారా?' అంది లలిత కొంచెం కోపంగానే.

మాతోపాటూ అక్కడే శాస్త్రి, ఆయన భార్య భారతి కూడా వున్నారు.

భారతి అంది 'మా ఆయనా అంతే. ఇంట్లో ఏ పని చెప్పినా టైము లేదు, టైము లేదు అంటాడు. కిచెన్ సింకు దగ్గర ఆరు నెలలనించీ నీళ్ళు లీకవుతున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా ఇవాల్టి దాకా దాన్ని ముట్టుకోలేదు'

శాస్త్రి 'ఒక్కొక్కప్పుడు అంతేనండీ. టైము దొరకదు. కాస్త పని తగ్గగానే ఆ పని మీదే వుంటాను కదా' అన్నాడు.

'దానికి నేను ఒప్పుకోను. కాస్త జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే, అనవసరపు పనులు నెత్తిన వేసుకోకుండా వుంటే, అన్నిటికీ టైం దొరుకుతుంది' అంది భారతి.

మా ఆవిడ నా వేపు చూసి ముసిముసి నవ్వులు నవ్వుతున్నది. కానీ ఏమీ అనలేదు.

నేను కూడా కనీ కనపడకుండా నవ్వి, 'భారతి చెప్పిన దాంట్లో నిజం వుంది. టైం దొరకక పోవటం అంటూ లేదు. అదేమీ ఒక వస్తువు కాదు బజారులో దొరకటానికి. ఎప్పుడూ రోజుకి ఇరవై నాలుగు గంటలూ, వారానికి ఏడు రోజులూ వుంటూనే వున్నాయి. వాటిని సరిగ్గా వాడుకోవటం, వాడకపోవటం మనమీదే ఆధార పడి వుంది. అది నా స్వానుభవంలో నేను నేర్చుకున్నది' అన్నాను.

అది నిత్య సత్యమే కనుక, దాని మీద ఇక వేరే చర్చ ఏమీ చేయకుండా ఇంటికి బయల్దేరాం నేనూ మా ఆవిడా. రాత్రి పన్నెండున్నర అయిందేమో, కారులో ఎక్కగానే నిద్రలోకి జారుకుంది శ్రీమతి. మా ఇంటికి ఎలాగో అరగంట డ్రైవింగ్‌వుంది కనుక, నెమ్మదిగా నా అనుభవాల ఆలోచనలలోకి జారుకున్నాను.

నేను వ్రాసిన కథలు 1968నించీ, తెలుగు పత్రికలలో ఎక్కువగా ప్రచురణ అవటం మొదలుపెట్టాయి. 1980 దశకంలో అమెరికా వచ్చేశాము. ఇక్కడికి వచ్చిన ప్పటినించీ ఈ కొత్త సంస్కృతికి అలవాటు పడటం, ఉద్యోగంలో నిలదొక్కుకోటానికి కష్టపడి పనిచేయటం, కొత్త జీవితంలోని మంచి చెడులకి తట్టుకోవటం, ఇండియా లో దగ్గరి వాళ్ళందరూ ఒక్కసారిగా దూరమయిపోవటం, ఇలా కారణాలు ఏవయినా నాకెంతో ప్రాణప్రదమైన తెలుగుసాహిత్యం నాకు దూరమయింది. ఆరోజుల్లో ఇక్కడ తెలుగు పుస్తకాలు దొరకకపోవటం ఒక కారణం అయినా, టైం లేదు అనేది అన్నిటి కన్నా పెద్ద కారణమయింది. దాంతో తెలుగు సాహిత్యం చదవటం, వ్రాయటంలో శ్రద్ధ తగ్గిపోయింది. అమెరికా వచ్చిన, మొదటి ఎనిమిదేళ్ళల్లో, గాంధీ సినిమా చూసి ప్రభావితమై, ఆంధ్రపత్రికలో 'అమెరికాలో గాంధీ' అనే వ్యాసం తప్ప మరేమీ వ్రాయ లేదు. కొంతమంది పత్రికా సంపాదకులు నన్ను మళ్ళీ కథలు పంపించమని వ్రాసి, నా దగ్గరనించీ అనుకూలమైన జవాబు రాకపోవటంతో, వాళ్ళూ వూరుకున్నారు. రెండు సార్లు ఇండియా వెళ్ళినప్పుడు, కొంతమంది ఎడిటర్జీలని కలిస్తే అదే అన్నారు. 'టైము లేదు' అనే సాకుతో తప్పించుకున్నాను. అలా నా 1990దాకా కాబోలు నా సాహిత్య వ్యాసాంగం నిద్రపోయింది.

రచన శాయిగారు నాకు త్రివేండ్రంలో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ లో పనిచేస్తున్నప్పుడు మంచి మిత్రులయారు. తరువాత ఆయన శ్రీహరికోటకి వెళ్ళి పోయాక, మా స్నేహం కొంచెం వెనకపడింది. తర్వాత మేమూ ఇక్కడికి వచ్చేశాం.

దరిమిలా శాయిగారు రచన పత్రిక స్థాపించారు. వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని మొత్తానికి ఆస్టిన్‌లో నా అడ్రస్ సంపాదించి, రచన పత్రికని పంపించటం మొదలు పెట్టారు. పోస్టేజే చాల అయేది. ప్రతి సంచికలోనూ ఒక చిన్న స్లిప్. దాని మీద ఒకే ఒక చిన్న వాక్యం. 'హవ్ ఎబౌట్ ఎ స్టోరీ' అని. అంతకన్నా ఇంకో ముక్క వుండేది కాదు. అలా ఎన్ని నెలలు పత్రికని పంపించారో! పోస్టులో రచన వచ్చిన రోజే, ఒక్క

అక్షరం కూడా వదలకుండా చదివేవాడిని. కానీ నాలో అదొక విధమైన గిల్టీ ఫీలింగ్ కూడా వుండేది.

మళ్ళీ పెరుగుతున్న నా సాహిత్యాభిలాష చూసి, ఒక రోజు మా అమ్మాయి కూడా అడిగింది 'నువ్వు కథలు వ్రాయటం లేదేం నాన్నా' అని.

మా ఆవిడ కూడా అందుకుంటూ 'అవును. పూర్తిగా వ్రాయటం మానేశావేం? ఇదిగో ఈ నెల కూడా ఆయన పట్టు వదలని విక్రమార్కుడిలా మళ్ళీ పుస్తకం పంపించారు. ఇండియాకి ఫోన్ చేసినప్పుడల్లా మా వాణీ, జ్యోతీ కూడా అడుగుతుంటారు, నువ్వు వ్రాయటం లేదేమిటని. మళ్ళీ వ్రాయకూడదూ' అని అప్పుడే వచ్చిన కొత్త సంచికని అందించింది.

అది విప్పగానే దాంట్లో ఒక చిన్న కాగితం. 'హవ్ ఎబౌట్ ఎ స్టోరీ' అని.

'నువ్వు వ్రాసే కథలన్నీ ఆకాశంలో కాక నేల మీదే జరుగుతాయనీ, నీ చుట్టూ జరిగే విషయాల గురించే వ్రాస్తావనీ అనేవాళ్ళు అందరూ. ఆయన కూడా అమెరికా జీవితం మీద మళ్ళీ నువ్వు కథలు వ్రాస్తావనే ఆ స్లిప్పులు పెడుతున్నారేమో' అంది శ్రీమతి.

అప్పుడే నా ఆలోచన ప్రారంభమయింది.

అవును నేను ఎందుకు వ్రాయటంలేదు? నిజంగా టైం లేదా? అలా లేదని నన్ను నేనే మోసం చేసుకుంటున్నానా? నెలకొక్కసారి, ఒక్క రోజు, మూడు నాలుగు గంటల సమయం వెచ్చించలేనా? అమెరికాలో జీవితం చాల బిజీగానే వుంటుంది. దానిలో అబద్ధం లేదు. కానీ తెలుగు సాహిత్యం చదవటం అంటే నాకు ప్రాణం. వ్రాయటం నా ఊపిరి. అలాటిది ఏమయింది నాకు?

ఆ రోజు నించీ సాహిత్యానికి కొంచెం సమయం కేటాయించటానికి ధృఢ నిశ్చయం చేసుకున్నాను. నా పాత కథలూ, వాటి మీద వచ్చిన అభిమానుల ఉత్తరాలూ, సంపాదకుల ఉత్తరాలూ ముందు వేసుకుని చూస్తూ ఆలోచన మొదలుపెట్టాను. మా ఆవిడ ఎలాగూ అమెరికాలో భారతీయుల జీవితం గురించి వ్రాయమని కథాంశాన్నీ, పట్టు వదలని విక్రమార్కుడి పేరుతో సహా చెప్పింది కనుక, నా ఆలోచనలకి ఒక రూపం వచ్చింది.

అదే అమెరికా బేతాళుడి కథ. అది పంపిస్తే, ఆ ఒక్క కథనీ వేసుకోమనీ, దాన్ని ఒక సీరియల్‌గా చేసి 'కొన్ని' కథలు వ్రాస్తేనే ప్రచురిస్తామనీ వ్రాశారు శాయి గారు. ఆ స్పందనతో, వరుసగా పన్నెండు కథలు 'అమెరికా బేతాళుడి కథలు' పేరుతో అదే పత్రికలో సీరియల్‌గా వచ్చాయి. తరువాత పుస్తకంగా కూడా వచ్చి, రెండు ఎడిషన్లు ప్రచురింపబడ్డాయి. ఇక నా వ్యాసాంగం ఆగలేదు. 1995 నించీ ఇప్పటిదాకా ఏడు పుస్తకాలు ప్రచురింపబడ్డాయి.

మరి వీటన్నిటినీ వ్రాయటానికి టైం దొరికిందా?

అమెరికాలో ఫాస్ట్ లైఫ్ ఏమయింది అన్నది పెద్ద ప్రశ్న!

0 0 0